# మరపు...... వరం !

మరపు మనిషికి వరం అన్నారు పెద్దలు. అందులో రెండు అభిప్రాయాల్లేవు.

'మరపు' మీద చాలా సినిమాలు వచ్చాయి. ఓ రెండు మూడు సినిమాలు తప్ప మిగతావాటిని మరచిపోయి వుండడమూ మనకు వరమేననుకోవచ్చు.




ఎవరివో నీవెవరివో అని శ్రీ శ్రీ ర్రాసిన పాటను చాలామంది ఇప్పటికీ మరిచిపోలేదు. ఆ పాట పునర్జన్మ సినిమాలోదని నేను వేరే చెప్పనక్కర్లేదు. దర్శకుడు ప్రత్యగాత్మ స్పార్క్‌కు అద్దంపట్టే సినిమాల్లో అదొకటి.

హీరో సున్నిత మనస్కుడైన కళాకారుడు. అతనికి మతిపోతుంది. అంతవరకూ తన జీవితంలో జరిగిన అనేక విషయాలను మరిచిపోతాడు. అంతవరకూ అతన్ని ప్రేమించిన అతని మరదలు తల్లి వద్దనడంతో అతనికి దూరంగా ఉంటుంది. అలాగే అతని అన్న, వదినలు కూడా పిచ్చివాడంటూ గేలిచేస్తారు.

హీరో తండ్రి ఎలాగయినా కొడుక్కి పిచ్చినయం చేయాలనుకుంటాడు. అతన్ని, అతని పిచ్చి చేష్టల్నీ సహిస్తూ సాకే అమ్మాయి ఉంటే, గతాన్ని నెమ్మదిగా గుర్తుచేయవచ్చని డాక్టర్ సలహా ఇస్తాడు.

ఓ వేశ్య కూతుర్ని ఆశ్రయిస్తాడు తండ్రి. ఒక పిచ్చివాణ్ని మనిషిని చేయగలగడం కంటే మంచిపని వేరేవుండదని నృత్య కళాకారిణి, గాయని అయిన ఆ అమ్మాయి ఒప్పుకొంటుంది. హీరో చేసే పిచ్చిపనుల్ని సహిస్తుంది.

ఈ గానం నా ప్రాణం నీ కోసం అని పాడుతూ ఆమె హీరోని నిద్రపుచ్చుతుంది. అతను మంటని చూస్తే భయపడిపోతాడు. వ్యసనపరుడైన అన్నగారు అతన్ని భయపెడుతుంటాడు. అతన్ని కన్నతల్లిలాగ సాకుతున్న ఆ కళాకారిణిని అనుభవించాలనుకుంటాడు. అతన్నించి హీరోనూ తననూ కాపాడుకుంటూ వస్తుంది ఆ కళాకారిణి.

దీపావళి పండుగరోజున కూడా ప్రమిదలు వెలిగించి, చిచ్చుబుడ్లులూ వగైరా కాల్చవద్దంటుంది. అంతగా అతన్ని కాపాడాలనుకుంటుంది. అలాగలాగ హీరోను నలుగురిలోకి వచ్చేలా చేసి ఎక్కడయితే అతనికి మతిపోయిందో అక్కడికి తీసుకెళ్తుంది. అతను గతంలో చిత్రించిన బొమ్మల్ని చూపెడుతుంది. హీరోకి నెమ్మదిగా గతం గుర్తుకొస్తుంది. ఆ కళాకారిణినీ, ఆమె చేసిన సేవల్నీ మరచిపోతాడు.

అంతకు ముందు పిచ్చివాడికి దూరంగా ఉండమన్న ఆ తల్లి కూతుర్ని మళ్లీ హీరోకి చేరువగా ఉండమంటుంది. తన కూతురే అతన్ని మళ్లీ మామూలు మనిషిని చేసిందని నమ్మబలుకుతుంది. తన కూతురికీ హీరోకీ పెళ్లి చెయ్యాలనుకుంటుంది. కళాకారిణి ఆ ఇంటిని విడిచి మళ్లీ గానా బజానాకు

వెళ్లిపోతుంది. హీరో మరదలిని ఆరాధనాభావంతో చూస్తాడు. ఆమెకు కృతజ్ఞుడై ఉండాలని అనుకుంటాడు. అయినా కళాకారిణికి సంబంధించి అతని మెదడులో ఏదో అస్పష్టత ఉంటుంది. కొంత కాలానికి కళాకారిణి రూపం కూడా కొంత అస్పష్టంగా అతని కళ్లల్లో కదులుతుంది. అతని మరదలు నిజం చెప్పేస్తుంది. హీరో కళాకారిణి ఇంటికి వెళ్తాడు. అంతవరకూ నలుగురిలోనూ నృత్యం చేయనన్న ఆమె అతను తనను అసహ్యించుకోవాలని 'దీపాలు వెలిగె పరదాలు తొలగె, ప్రియురాలు పిలిచె రావోయి' అని పాడుతూ ఆడుతుంది. అంతలో హీరో అన్నగారు ఆమె చెయ్యి పట్టుకోబోతాడు. హీరో అతన్ని అడ్డుకుంటాడు. ఆ అన్నగారు హీరోను భయపెట్టాలని అగ్గిపుల్ల వెలిగిస్తాడు. హీరో నిప్పు నిప్పు అంటూ భయపడతాడు. ఆమె అతన్ని కాపాడ్డం కోసం దగ్గరకు తీసుకుంటుంది. తనకు మళ్లీ మరపు రాలేదనీ, నీ కోసమే అలా నటించానని హీరో అంటాడు. అలా ఆ మరపు సినిమా సుఖాంతమవుతుంది.

మరో మరపు సినిమా 'వసంత కోకిల'. ఓ అమ్మాయి తలకు దెబ్బ తగలడంతో గతాన్ని మరచిపోయి చిన్న పిల్లలా ప్రవర్తిస్తుంది. హీరో ఆమెను కన్న తండ్రిలా సాకుతాడు. గుర్రం ఆట, కోతులాట వంటివి ఆడి ఆమెను నవ్విస్తాడు. నెమ్మదిగా ఆమెను ప్రేమిస్తాడు. ఆమె తలకు మళ్లీ దెబ్బ తగిలి గతం గుర్తుకొచ్చి అతన్ని మరచిపోతుంది.

హీరో రైల్వే స్టేషన్లో ఆమెకు తను గుర్తురావాలని కోతిచేష్టలు చేస్తాడు. అయినా అతను ఆమెకు గుర్తు రాడు. అలాగే ఈ మరపు కథ విషాదాంతమవుతుంది.

ఆ రెండు సినిమాలూ నాకింకా గుర్తున్నాయంటే నాకు మరపురాలేదన్న మాట. లేదా ఆ రెండూ నాకు నచ్చడంవల్లనే వాటిని నేను మరచిపోలేదనుకుంటాను. మరికొన్ని మరపు సినిమాలు నాకు నచ్చకపోవడంవల్లే వాటిని నేను మరచిపోయేననుకుంటాను.

అంటే మనకు నచ్చిన వాటిని మరచిపోలేమనీ, నచ్చని వాటిని మరచిపోతామనీ అనుకోవచ్చును కుంటాను.

ఇప్పుడు కేంద్ర క్రీడల మంత్రి ఉమాభారతికి మరపు వచ్చింది. అదీ అన్ని విషయాల్లో కాదు. బాబ్రీ మసీదు కూల్చివేతకు సంబంధించిన విషయాలు ఆమెకు సరిగా గుర్తుకురావడం లేదు. అది కూడా లిబర్హాన్ కమిషన్ ముందు సాక్ష్యం ఇచ్చేటప్పుడు కొన్ని మాత్రం ఉమకు గుర్తున్నాయి. నిగ్రహంతో ఉండమని కరసేవకులను ఒకటికి రెండుసార్లు అద్వానీ ఆదేశాల మేరకు తాను చేసిన విజ్ఞప్తిని ఆమె మరవలేదు.

మసీదును కూల్చివేయమని కరసేవకులను ప్రోత్సహిస్తూ తాను నినాదాలు చేసినట్టుగానీ ఉద్రేకపూరిత ప్రసంగాలు చేసినట్టుగానీ ఉమకు గుర్తులేదు.

1992 డిసెంబర్ ఆరో తేదీన మురళీమనోహన్ జోషిని తాను కౌగలించుకున్నప్పుడు ఫొటోగ్రాఫర్ కెమేరా క్లిక్ చేసినప్పుడు టైమెంతో ఆమె మరువలేదు.

కూల్చివేతకు సంబంధించి కమిషన్ అడిగిన ప్రశ్నలకు మాత్రం ఉమ తనకేమీ ఆ సంగతులు గుర్తుకు రావడం లేదంది.

అంటే, ఉమాభారతిలాంటివారు ఇబ్బంది కలిగించే వాటిని మరచిపోతారనీ, ఇబ్బంది కలిగించని వాటిని మరువలేరని అనుకోవచ్చునుకుంటాను. ఏమంటారు?

19-1-2001, వార్త దినపత్రిక